సాక్షి ఖమ్మం

సోమవారం : 6 : మే : 2024



ఇక దోస్త్ షురూ..

రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. IIలో



కాంగ్రెస్‌లో చేరికల లొల్లి..

వైరా నియోజకవర్గ కాంగ్రెస్‌లో చేరికల లొల్లి షురువైంది. బీఆర్ఎస్ నుంచి పలువురు రాగా వారిని ప్రస్తుత నాయకులు అడ్డుకుంటున్నారు. IIలో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం

43° / 29°

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఒకటి, రెండు చోట్ల చిరు జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు బోనకల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు చింతకాని, 6 గంటలకు ముదిగొండలో పర్యటిస్తారు.

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలకు ఏర్పాట్లు

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల సీనియర్ క్రీడాకారులు ఫుట్‌బాల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేగాక ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు నిర్వహించే వారికి ఉచితంగా ఫుట్‌బాల్ పరికరాలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల 2వ, ఆరవ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 6 నుంచి, నాలుగో సెమిస్టర్ల పరీక్షలు 7 నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి ఆదివారం తెలిపారు. 2వ సెమిస్టర్ల పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 28, 30 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని వివరించారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 68,139, నాలుగో సెమిస్టర్‌కు 56,899, ఆరో సెమిస్టర్‌కు 46,077 మొత్తం 1,71,115 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉమ్మడి వరంగల్‌లో 44, ఉమ్మడి ఖమ్మంలో 30, ఉమ్మడి ఆదిలాబాద్‌లో 49 మొత్తం 123 సెంటర్లు ఏర్పాటు చేసి 123 మంది చీఫ్‌సూపరింటెండెంట్లను నియమించామని పేర్కొన్నారు. ఒక్కో సెంటర్‌కు ఒక అబ్జర్వర్, వర్సిటీ పరిధిలో పది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించినట్లు తెలిపారు. హాల్‌టికెట్లు కళాశాలల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, కళాశాలల నుంచి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రేపు ఖమ్మానికి వెంకటేష్ రాక

ఖమ్మంమయూరిసెంటర్ : సినీ హీరో వెంకటేష్ మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు టూర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తుంబూరు దయాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి వియ్యంకుడైన వెంకటేష్ ఆయన తరఫున ప్రచారం చేసేందుకు వస్తున్నట్లు తెలిపారు. 7వ తేదీ సాయంత్రం 5గంటలకు ఖమ్మం మయూరిసెంటర్ నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్ వరకు జరిగే రోడ్ షోలో పాల్గొంటారని, రాత్రి 8 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో జరిగే పుర ప్రముఖుల సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు, వెంకటేష్ అభిమానులు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన సంకల్పపత్రం చూస్తే గత పదేళ్లలో ఏం చేశారు.. రానున్న 27 ఏళ్లలో వారి విజన్ ఏమిటో తెలుస్తుంది. ఇక నా బ్యాక్‌గ్రౌండ్ చూస్తే గత పదేళ్లలో అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా. నాకున్న ఎక్స్‌పోజర్ ఇక్కడి పొలిటీషియన్లలో ఎవరికీ లేదు. ప్రజలతో నాకు నేరుగా సంబంధాలున్నాయి. నాది అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం తిమ్మంపేట. పారాచూట్ వేసుకుని దిగలేదు. ఇక్కడి ప్రజల్లో ఒకడిని.. ఖమ్మం పార్లమెంట్ ప్రజలు నన్ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తా' అని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, రాజకీయ రంగప్రవేశం, అభివృద్ధిలో ప్రాధాన్యాలు, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలు తదితర అంశాలు ఆయన మాటల్లోనే..

- ప్రధాని నరేంద్ర మోదీ విజన్ ఉన్న నాయకుడు
- విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి నా ప్రాధాన్యాలు
- ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదు ..
- బీజేపీని గెలిపించాలని ప్రజలు డిసైడ్ అయ్యారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ప్రజల నుంచి స్పందన లేదు

'సాక్షి' ఇంటర్వ్యూలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

ప్రజాసేవ లక్ష్యంగా..

ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చా. 2014 నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంటి ధార్మిక సంస్థల ద్వారా ఇన్‌స్పైర్ అయ్యా. స్పిరిచ్యువల్ కుటుంబంలో పుట్టిన నేను ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పెరిగా. సామాజిక సేవలోనే ఉన్నా. 2014 వరకు బిజినెస్‌లో కొంతమేర సెటిల్ అయ్యా. బిజినెస్ దాదాపుగా పక్కన పెట్టి.. పదేళ్లలో అనేక ఎన్జీవోస్‌లో పనిచేసిన అనుభవం, సంబంధాలతో ఖమ్మంను అభివృద్ధి చేయొచ్చనుకున్నా. ఆదిలాబాద్, వికారాబాద్, మెదక్‌లో జరిగిన అభివృద్ధి ఇక్కడ లేదు. ఇక్కడికి వచ్చి చూశాక అదే అర్థమైంది. జిల్లా బాగుపడాలంటే గ్రామ వికాసం ప్రధానం. ఇందుకు ప్రభుత్వం నుంచి పథకాలతో పాటు ఎన్జీవోల నుంచి కూడా యాక్టివిటీ ఉండాలి. కార్పొరేట్ సంస్థలు కూడా సీఎస్ఆర్ నిధులతో పనులు చేయాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది.

రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం..

సర్వేలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయి. ప్రజలు కచ్చితంగా నరేంద్రమోదీకి ఓటు వేయాలని డిసైడ్ అయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాదని తెలిసి కూడా ఆరు గ్యారంటీలను ప్రచారం చేసింది. ఇప్పుడు ఆరు గ్యారెంటీలు అంటే ప్రజలు తరిమికొడతారు. అందుకే వాటి జోలికి పోకుండా రిజర్వేషన్లు తీసేస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దొంగ వీడియోలు, మార్ఫింగ్ వీడియోలను ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. వీటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. వారు అన్నింటికీ తెగించారు. శిక్ష పడినా ఏమవుతుందిలే.. ముందయితే పబ్బం గడుపుకోవాలనే ధోరణిలో ఉన్నారు.

దేశం ఆర్థికంగా దూసుకెళ్తోంది..

పదేళ్ల క్రితం భారత ఆర్థిక వ్యవస్థ దిగువ ర్యాంకులో ఉంది. ఇప్పుడు ఐదో ర్యాంకులో ఉంది. రానున్న కాలంలో మూడో ర్యాంకుకు చేరుతుందని ప్రపంచ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ మాత్రం బీజేపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగడం లేదని విమర్శిస్తున్నారు. ప్రపంచ నిపుణులే చెప్పిన తర్వాత కేసీఆర్ ఎంత. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో నరేంద్రమోదీ రాజకీయాల్లోకి వచ్చారు. నేను పదేళ్లుగా ప్రజాసేవ చేస్తున్నా. డబుల్ పోస్ట్ గ్రాడ్యుయేట్‌ను. నా సేవా తత్పరత చూసి ప్రజలు ఓటు వేస్తారు. స్కామ్‌లు చేసే వారికి అవకాశం ఇస్తే స్కామ్‌లే చేస్తారు. పని చేసే వారికి అవకాశం ఇస్తే పని చేస్తారు.

అనుసంధానకర్తగా ఉంటా..

దక్షిణ అయోధ్యగా ఉన్న భద్రాచలం అభివృద్ధి చెందడం లేదంటున్నారు. ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదంటున్నారు. అధికారంలో ఉన్న వారు కేంద్రాన్ని ఈ సమస్యలపై అడిగారా.? కేంద్రం ఏమైనా చేయాలంటే ఇక్కడ అధికారంలో ఉన్న వారు చొరవ తీసుకోవాలి. కేంద్ర మంత్రులను తీసుకురావాలి. వారికి సమస్యలు వివరించాలి. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు హామీలతో పనులు చేయడం లేదు. ఇక్కడి నుంచి నన్ను గెలిపిస్తే సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా. ప్రజలకు, కేంద్ర ప్రభుత్వానికి అనుసంధానకర్తగా ఉంటా.

ప్రజాదరణ బాగుంది..

నేను ప్రచారం చేస్తుండగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. వారి నుంచి ఆదరణ కనిపిస్తోంది. ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం ఇలా ఎక్కడ నేను రోడ్‌షో చేసినా వేల మంది వచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీకే ఆదరణ ఎక్కువగా వస్తోంది. ఇక్కడ మూడు నెలల నుంచి తిరుగుతున్నా. మోదీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు అర్థమైంది. అందుకే ఆయన పార్టీ అభ్యర్థిని గెలిపించాలని నిర్ణయించుకున్నారు. బస్తర్ మహారాజ్ కమల్‌బంజ్ నియో ప్రచారానికి వస్తున్నారు. నాలుగు రోజులపాటు ఇక్కడే ఉంటారు. మిగిలిన ఈ రోజుల్లో ప్రచారాన్ని మరింత ఉధృతంగా చేస్తాం. పార్టీ కేంద్ర మంత్రులు, రాష్ట్ర, జిల్లా నాయకులతో ప్రచారం ఇప్పటి వరకు జోష్‌గా సాగింది. పార్లమెంట్ పరిధిలోని నేతలు, పార్టీ కార్యకర్తలు ప్రచారంలో కదం తొక్కుతున్నారు.

సమస్యలపై దృష్టి పెడతా..

నన్ను గెలిపిస్తే సమస్యలపై దృష్టి పెడతా. కేంద్ర ప్రభుత్వం సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్స్, ఎన్జీవోలను ప్రోత్సహించేలా చూస్తా. రైతులకు మార్కెట్‌ను అనుసంధానం చేయాల్సి ఉంది. వారికి సహజ వనరులు అందుబాటులో ఉండేలా చూస్తా. పామాయిల్ బోర్డు ఏర్పాటుకు కృషిచేస్తా. ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీతో అనేక ఉపయోగాలున్నాయి. ఫుడ్‌పార్క్‌లు, ఎస్ఈజెడ్‌లు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేసేలా కృషిచేస్తా. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు, కొవ్వూరు రైల్వేలైన్, గోదావరి నీళ్లు సత్తుపల్లికి తరలించేందుకు, సత్తుపల్లిలో ఓపెన్‌కాస్ట్‌తో ఏర్పడుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు, కొత్తగూడెం వరకు ప్యాసింజర్ రైళ్లను నడిపించేందుకు, శాతవాహన రైల్‌స్టాప్‌లు పెంచేందుకు నావంతు ప్రయత్నాలు చేస్తా. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తా.

పొరపాట్లు జరగనివ్వొద్దు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ.పీ.గౌతమ్




కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న గౌతమ్

ఖమ్మం సహకారనగర్/వైరా: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చేపడుతున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో చేపట్టిన చేపడుతున్న ఖమ్మం, పాలేరు, వైరా అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం, వీవీ ప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియను, ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ల కనెక్షన్లపై, కమిషనింగ్ ప్రక్రియలో చేయాల్సిన, చేయకూడని పనుల విషయమై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్యాలెట్ యూనిట్‌లోని స్క్రీన్ తెరచి, బ్యాలెట్ పత్రాల కూర్పు సక్రమంగా చేపట్టాలని, బ్యాలెట్ స్క్రీన్‌ను అడ్రస్ ట్యాగ్‌తో సీల్ చేయాలని అన్నారు. బ్యాలెట్ యూనిట్‌లో అవసరమైన సంఖ్య వరకు అభ్యర్థుల, నోటాతో సహా అన్‌మాస్క్ చేయాలన్నారు. అన్ని విషయాలను కమిషనింగ్‌కి హాజరైన వివిధ పార్టీల ప్రతినిధులు గమనించాలని కోరారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ నుంచి, కమిషనింగ్ హాల్ వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రిజర్వ్ పోలింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి 36 టేబుళ్లు, పాలేరు నియోజకవర్గానికి 29 టేబు ళ్లు ఏర్పాటుచేశామని చెప్పారు. అనంతరం హోమ్ ఓటింగ్ ప్రక్రియ గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సోమవారంలోగా కమిషనింగ్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏఆర్ ఓ ఆదర్శ్ సురభి, పాలేరు ఏఆర్ఓ ఎం.రాజేశ్వరి, వైరా ఏఆర్ఓ బి.సత్యప్రసాద్, తహసీలార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అకాల వర్షం

- పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వడగండ్ల వాన
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేలరాలిన మామిడి
- ఉష్ణోగ్రతల నుంచి కాస్త ఉపశమనం



కారేపల్లి మండలం రేగులగూడెంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం



పేరేపల్లిలో పడిన వడగండ్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో పాటు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయంలో వర్షం కురవడంతో జిల్లా వాసులకు కొంత ఉపశమనం కలిగినట్లయింది. అయితే ఈదురుగాలులతో జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. చేతికందే దశలో ఉన్న మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న మామిడి నేలరాలింది. పలుచోట్ల చివరి దశలో ఉన్న వరి కోతలు, ధాన్యం పనులకు ఆటంకం కలిగింది.

కూలిన హోర్డింగ్‌లు..

ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పలుచోట్ల హోర్డింగ్‌లు కూలిపోయాయి. ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. కారేపల్లి మండలం గేటు కారేపల్లిలో రాత్రి 7 గంటల సమయంలో 14.5 మి.మీ. వర్షపాతం నమోదు కాగా ఖమ్మం నగరంలోని ఖానాపురం వద్ద 13 మి.మీ., కామేపల్లి మండలం లింగాల వద్ద 8, ఖమ్మం నగరంలోని ప్రకాష్‌నగర్ వద్ద 7, రఘునాథపాలెం, ముదిగొండ మండలం పమ్మిలో 4.8, పంగిడిలో 4.5, నేలకొండపల్లిలో 3.5, చింతకాని మండలం నాగులవంచలో 2.8, చింతకానిలో 2.3, కొణిజర్లలో 1.5, ఖమ్మం నగరంలోని ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్ వద్ద 0.8, బాణాపురం, బచ్చోడులలో 0.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు..

ఈదురుగాలులు, అకాల వర్షంతో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనేక చోట్ల రహదార్ల వెంట చెట్లు కూలి విద్యుత్ లైన్లపై పడగా, పలుచోట్ల స్తంభాలు సైతం విరిగిపడ్డాయి. పలుచోట్ల రాత్రి 8 గంటల వరకు కూడా సరఫరా పునరుద్ధరించలేదు. ఖమ్మం నగరంలోని మమత రోడ్, ధంసలాపురం తదితర సబ్‌స్టేషన్లలో శనివారం అధిక ఉష్ణోగ్రతల కారణంగా పరికరాలు కాలిపోయి ఫీడర్లు దెబ్బతిన్నాయి. దీంతో పలుచోట్ల సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ పనులు కొనసాగుతున్న సమయంలోనే ఆదివారం సాయంత్రం వర్షం, గాలులతో మరోసారి అంతరాయం వాటిల్లింది.

ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం

అకాల వర్షంతో ఉష్ణోగ్రతల నుంచి కొంత ఉపశమనం కలిగిందని చెప్పొచ్చు. ఈ ఏడాది రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాలో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నెలరోజులుగా ఆరెంజ్ అలర్ట్(40–45 డిగ్రీలు) ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మే నెల ఆరంభం నుంచి రెడ్ అలర్ట్‌కు పెరిగాయి. పలుచోట్ల 45 నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లడానికి భయపడుతున్నారు.

నేలరాలిన మామిడి..

ఈదురుగాలులు, అకాల వర్షానికి ఖమ్మం, కూసుమంచి, మధిర, వైరా తదితర డివిజన్లలో కోత దశలో ఉన్న మామిడి పంట నేలరాలింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం సత్తుపల్లి డివిజన్‌లోని పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ, కల్లూరు మండలాల్లో ఈదురుగాలులు, అకాల వర్షానికి మామిడి నేల రాలగా, ఆదివారం జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో పంట దెబ్బతింది.

విద్యాశాఖ కమిషనర్‌పై చర్య తీసుకోవాలి

టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ నేతల డిమాండ్



మాట్లాడుతున్న చావా రవి

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) వివాదం పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత సెప్టెంబర్‌లో అర్ధంతరంగా నిలిచిపోయిన పదోన్నతులు కొనసాగింపునకు ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్‌సీఈఆర్‌టీ వివరణ తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరడంతో ఫిబ్రవరిలో క్లారిఫికేషన్ కోసం లేఖ రాసి రహస్యంగా ఉంచారని అన్నారు. ప్రధానోపాధ్యాయులకు పని చేస్తున్న పాఠశాలల స్థాయిలో మార్పు లేనప్పుడు పదోన్నతులకు టెట్ అవసరం లేదంటూ ఏప్రిల్ 8 న వచ్చిన వివరణ లేఖను వెల్లడించకుండా ఉపాధ్యాయులందరినీ మానసిక ఆందోళనకు గురి చేశారని ఆరోపించారు. అందరినీ టెట్‌కు దరఖాస్తు చేయించటం ద్వారా రూ.లక్షలు వృథా చేయించారని అన్నారు. ఎన్నికలు ముగిసేలోగా ఎన్‌సీఈఆర్‌టీ నుంచి మరికొన్ని అంశాలపై వివరణ తీసుకుని ఎన్నికలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వి. నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బుర్రి వెంకన్న, కోశాధికారి వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులు పి.సురేష్, ఉద్దండు షరీఫ్, డి. నాగేశ్వరరావు, ఎస్.సతీశ్ పాల్గొన్నారు. కాగా, టెట్ వివాదం పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాశాఖ కమిషనర్ పై చర్య తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, ఎస్.విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెప్టెంబర్ లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యావలంటీర్లను నియమించి కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా నీట్

ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు



రూం నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం



వివరాలు పరిశీలించి కేంద్రంలోకి పంపిస్తున్న సిబ్బంది



ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థి కాలుకు ఉన్న తాడును తొలగిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) ఆదివారం జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించగా ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 3, 260 మంది విద్యార్థులకు గాను 3,179 మంది హాజరు కాగా 81 మంది గైర్హాజరైనట్లు పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్ ఆర్.పార్వతిరెడ్డి తెలిపారు.

ముందస్తుగానే కేంద్రాలకు..

పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు నిర్వహించగా, 11 గంటల నుంచి 1:30 గంటల వరకే కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పడంతో విద్యార్థులు ముందస్తుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎండలు అధికంగా ఉంటున్న క్రమంలో విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు, బంధువులు పరీక్ష కేంద్రాల సమీపంలో చెట్ల కింద సేదదీరారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కేంద్రాల సమీపంలో టెంట్లు వేయడంతో పాటు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు.

నిబంధనలు కఠినం..

నీట్‌కు నిబంధనలు కఠినతరంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో పరీక్ష కేంద్రాలకు చెవుల దిద్దులు, చైన్లు తదితర వస్తువులను ధరించి వచ్చిన వారిని అనుమతించని అధికారులు.. వాటిని తొలగించి రావాలని సూచించారు. దీంతో విద్యార్థులు చెవి దిద్దులు, షూ, చైన్లు, తదితర వస్తువులను తల్లిదండ్రులు, బంధువులకు అందించి పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



ప్రతిభ చాటిన కార్మికులను అభినందిస్తున్న ఆర్ఎం వెంకన్న

ఆర్టీసీ ఆర్ఎం వెంకన్న

మధిర: సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమవుతుందని సంస్థ రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న అన్నారు. మధిర డిపో ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన 3, 4 త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆర్ఎం మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లు కీలకమని తెలిపారు. రీజినల్ స్థాయిలో విధి నిర్వహణలో సహచర ఉద్యోగులకు ప్రేరణగా నిలిచి అత్యధిక ఆదాయం సంపాదించిన ఉద్యోగులకు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతర విభాగాల్లోనూ విధినిర్వహణలో అత్యంత ఫలితాలను రాబట్టిన ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరుతో ఇటీవల చేపట్టిన కార్యక్రమంలో డిపోల్లో ఉన్న అన్ని విభాగాల ఉద్యోగులకు 11 రకాల ఆరోగ్య పరీక్షలు చేయించినట్లు తెలిపారు. వారి రిపోర్టులను బట్టి నిపుణులైన వైద్యులతో సలహాలు, సూచనలు అందజేయిస్తున్నామని వివరించారు. అవసరమైన వారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రులకు పంపిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

అందని పెన్షన్లతో అవస్థలు

ఖమ్మంవ్యవసాయం: పెన్షన్లు సకాలంలో అందకపోవటంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ విశ్రాంత ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిలిచిపోయిన పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా మార్కెట్ కమిటీల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కనపర్తి బాబు, జల్లా వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉన్నతాధికారులకు, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కూడా వినతిపత్రం అందించామని, వృద్ధాప్యంలో పెన్షన్‌తో జీవనం సాగిస్తున్న తమకు సకాలంలో నెలసరి పెన్షన్లను అందించి ఆదుకోవాలని కోరారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి


భూక్యా రాములు (ఫైల్)

పెనుబల్లి: వడదెబ్బకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వీఎంబంజరలో చోటుచేసుకుంది. మండలంలోని సూర్యబంజరతండాకు చెందిన భూక్యా రాములు (44) ఈ నెల 3న వీఎం బంజరకు ఓ పార్టీ మీటింగ్‌కు హాజరై, అక్కడి నుంచి కనిపించకుండా పోయాడు. రాములు కోసం రెండు రోజులుగా కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఆదివారం వీఎంబంజర – బయ్యన్నగూడెం గ్రామాల మధ్య చెరువు సమీపంలో రాములు మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాములు వడదెబ్బకు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు వీఎం బంజర పోలీసులు కేసు నమోదు చేశారు. రాములు మృతదేహాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గొర్రెలు మేపేందుకు వచ్చి..

వడదెబ్బతో నారాయణపేట వాసి మృతి


నర్సప్ప మృతదేహం

నేలకొండపల్లి: గొర్రెలు మేపేందుకు నారాయణపేట జిల్లా నుంచి వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందాడు. నారాయణపేట జిల్లా దన్వాడ మండలంలోని గోటూరు గ్రామానికి చెందిన నర్సప్ప (55) తనకున్న వంద గొర్రెలను మేత కోసం తీసుకొచ్చాడు. ఇటీవల తన కుమారుడి పెళ్లి కోసం వెళ్లి రెండు రోజుల కిందట తిరిగొచ్చాడు. ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి మంద మధ్యలోనే కుప్పకూలాడు. చాలా సేపటి తర్వాత రైతులు నర్సప్పను గమనించి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

రెండు చోట్ల చోరీ


గల్లా పెట్టె తెరిచి ఉన్న దృశ్యం

బోనకల్: మండల కేంద్రంలోని ఖమ్మం రోడ్డులో డెయిరీ మిల్క్, పక్కన ఉన్న ఫ్యాన్సీ స్టోర్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపుల వెనుక తలుపులు పగులగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించి రూ.20 వేలు నగదు ఎత్తుకెళ్లారని డెయిరీ మిల్క్ యజమాని రాజు తెలిపారు. పక్కనే ఫ్యాన్సీ షాపులోకి వెళ్లి సామగ్రిని అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

చెరువు కట్టపై ఉద్రిక్తత

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి చెరువు వద్ద శనివారం అర్ధరాత్రి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చెరువు లూటీ అవుతోందనే ప్రచారంతో రాజకీయ నాయకులు అక్కడికి చేరుకున్నారు. చెరువులో ఆదివారం చేపల వేటకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ, శనివారం రాత్రి చెరువు లూటీ జరుగుతోందని గ్రామంలో ప్రచారం జరగటంతో రెండు వర్గాలకు చెందిన వివిధ పార్టీల నాయకుల మధ్య ఘర్షణ పడ్డారు. అసభ్య పదజాలంతో ఒకరిపై ఒకరు దూషణలు, అరుపులు, కేకలతో చెరువు కట్ట వద్ద అర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. కాగా, సొసైటీకి చెందిన సభ్యులు 32 మందిపై బైండోవర్ ఉండటంతో ఒక్కరూ కూడా చెరువు కట్ట వద్దకు రాకపోవడం కొసమెరుపు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని శాంతింపజేశారు. ఆదివారం చేపల వేట సాగించిన అధికారులకు కేవలం క్వింటా చేపలు మాత్రమే లభ్యం కావటం విశేషం.

లారీ పైనుంచి కిందపడి వ్యక్తికి గాయాలు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శనివారం రాత్రి లారీ పైనుంచి కిందపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మొక్కజొన్న బస్తాలు లారీలో లోడ్ చేస్తున్న క్రమంలో గాలి దుమారంతో కూడిన వర్షం వచ్చింది. ఈ క్రమంలో టార్పాలిన్ కప్పేందుకు లారి ఎక్కిన పెద్దిపాక కోటేశ్వరరావు గాలి దుమారానికి టార్పాలిన్‌తో సహా లారీ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,229

ఇక దోస్త్ షురూ..


ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల

- మూడు విడతల్లో డిగ్రీలో ప్రవేశాలు
- నేటి నుంచి దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రవేశాల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈనెల 3వ తేదీన విడుదల చేసింది. ఈనెల 6 నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర కోర్సుల్లో చేరాలనుకునే వారు దోస్త్ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. దోస్త్ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియలో విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తాము చేరదలుచుకున్న కళాశాలను, సబ్జెక్టులను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ అడ్మిషన్ ప్రక్రియ మూడు విడతలుగా కొనసాగుతుంది. ఖమ్మం జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 37 ప్రైవేటు డిగ్రీ కళాశాలలున్నాయి. ఖమ్మం నగరంలో ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సత్తుపల్లి, నేలకొండపల్లి, మధిరల్లో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కలిపి 15,840 సీట్లు ఉన్నాయి. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 16 ప్రైవేటు కళాశాలలు ఉండగా 7,380 సీట్లు ఉన్నాయి. మీ సేవ, ఆన్‌లైన్ సర్వీస్‌లతో పాటు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ సమయంలో విద్యార్థులకు కావాల్సినవి..

- ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్
- ఆధార్‌కార్డు జిరాక్స్
- ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్ నంబర్.
- టెన్త్, ఇంటర్మీడియట్ మెమోలు
- 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు
- ఇంటర్మీడియట్ టీ.సీ
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- ఆధార్‌కార్డు

ఓటీపీలు ఇతరులకు చెప్పొద్దు



దోస్త్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఓటీపీని ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే కళాశాలలో ఉన్న హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించవచ్చు. లేదంటే సమీపంలోని కళాశాలల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

– ఎం.సుబ్రహ్మణ్యం, దోస్త్ కో ఆర్డినేటర్, ఖమ్మం

దోస్త్ ప్రక్రియ ఇలా..

దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా డిగ్రీలో ప్రవేశాల కోసం మూడు విడతల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. తొలి విడత ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుండగా వచ్చే నెల 25వ తేదీ వరకు విద్యార్థులు రూ.200 రుసుంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 3న మొదటి విడత డిగ్రీ సీట్ల కేటాయింపు ఉంటాయి. 4 నుంచి 10వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ కళాశాల ఫీజు, సీటు రిజర్వేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి.

- ఇక 2వ విడతలో రూ. 400 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఆన్‌లైన్ చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చే నెల (జూన్) 4 నుంచి 13వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు ఉండగా, 4 నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. 18న సీట్లు కేటాయిస్తారు. 19 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ కళాశాల ఫీజు, సీటు రిజర్వేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.
- 3వ విడత ప్రక్రియ జూన్ 19 నుంచి 25వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు జరగనుండగా రూ.400 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. 19 నుంచి 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 29న సీట్ల కేటాయింపు జరగనుంది. 29 నుంచి జూలై 3వ తేదీ వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. 1, 2, 3 విడతల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులంతా జూన్ 29నుంచి జూలై 5వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి 6వ తేదీల్లో ఆయా కళాశాలల్లో విద్యార్థులతో ఓరియెంటేషన్ కార్యక్రమాలు ఏర్పాటుచేసి 8 నుంచి తరగతులు నిర్వహించనున్నారు.

కాంగ్రెస్‌లో చేరికల లొల్లి..

ఎమ్మెల్యే సమక్షంలోనే రెండు వర్గాల మధ్య వాగ్వాదం


వైరాలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

వైరా/కొణిజర్ల: వైరా నియోజకవర్గ కాంగ్రెస్‌లో చేరికల లొల్లి షురువైంది. ఇప్పటికే నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి చేరికలు ప్రారంభం కావడంతో కాంగ్రెస్‌లో ఇప్పటివరకు పనిచేసిన నాయకులు వారిని అడ్డుకోవాలని చూస్తున్నారు. ఒకప్పుడు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు వరస కట్టిన ద్వితీయ శ్రేణి నాయకులు ఇప్పుడు తమ అవసరాల నిమిత్తం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతుండగా.. ఏళ్లుగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారు వ్యతిరేకిస్తున్నారు. ఆదివారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ క్యాంపు కార్యాలయం వద్ద కొణిజర్ల మండల కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున సుమారు 3 గంటలకు పైగా ఆందోళన చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. విద్యుత్ కూడా తొలగించి బీఆర్‌ఎస్ నుంచి వచ్చే వారిని చేర్చుకోవద్దని స్పష్టం చేశారు. కొణిజర్ల మండలంలో సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పని చేసిన చిరంజీవి, శ్రీనవాసరావు, మాజీ సర్పంచ్ ఒకరు, సీనియర్ నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు యత్నిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి.. మంత్రికి దగ్గరగా ఉండే మండల నాయకుడి ద్వారా కాంగ్రెస్ కండువా కప్పించు కోవాలని ప్రయత్నించారు. దీనిని మంత్రి పొంగులేటి వ్యతిరేకించి, ఎమ్మెల్యే సమక్షంలో చేరాలని సూచించినట్లు సమాచారం. దీంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడినని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో పార్టీలో చేరేందుకు వైరాలో ఆదివారం భారీ ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న కొణిజర్ల మండలానికి చెందిన కోసూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. టెంట్లు పీకి రచ్చ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని కార్యకర్తలను సముదాయించారు. అయినప్పటికీ కార్యకర్తలు ఎమ్మెల్యేను పట్టించుకోకుండా గలాటా సృష్టించారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రోత్సహించిన కొణిజర్ల మండల నాయకుడు వడ్డె నారాయణరావు క్యాంపు కార్యాలయంలో ఉన్నాడని తెలుసుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుమారు 3 గంటల పాటు కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యేకు మధ్య వాగ్వాదం జరిగింది.



కాంగ్రెస్‌లో చేరికలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి పలువురు నాయకులు ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొణిజర్ల మండలం బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు యంత్రప్రగడ చిరంజీవి, ఏలూరి శ్రీనివాసరరావు, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, తీగలబంజర మాజీ సర్పంచ్ షేక్ అఫ్జల్‌బీ, దాదూ దంపతులు, గోపవరం బీఆర్‌ఎస్ నాయకుడు గుర్రం రామకృష్ణ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు, వైరా మున్సిపాలిటీ కౌన్సిలర్లు మరికంటి డేడీకుమారి, శివ దంపతులు, ఇమ్మడి రామారావు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, గోసు మధు, దొబ్బల సౌజన్య, దాసరి దానియేలు, రాంపూడి రోశయ్య, గుమ్మా రోశయ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి

- మంచికి, చెడుకు మధ్య జరుగుతున్న పోరాటం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అభివాదం చేస్తున్న మంత్రి తుమ్మల, సీపీఎం నేతలు


నెహ్రూసెంటర్: దేశ సమాగ్రాభివృద్ధి, పరిరక్షణ, సంక్షేమం కోసం ఇండియా కూటమిని (కాంగ్రెస్) గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్‌లో ఎన్నికల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఎత్తుగడలు ఎండగట్టాలని, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు పేదలు, పెట్టుబడిదారులకు, మంచికి, చెడుకు జరుగుతున్న పోరాటమని, ఈ పోరాటంలో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభమైందని, ఇందులో ఇండియా కూటమి తప్పక గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం కృషి చేయాలని, అత్యధిక మెజార్టీ అందించాలని పిలుపునిచ్చారు. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్న బీజేపీని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య చెప్పారు. సభలో డోర్నకల్, మానుకోట ఎమ్మెల్యేలు రాంచంద్రునాయక్, భూక్యా మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డితోపాటు జి.నాగయ్య, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఘనపురపు అంజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ సత్తా చాటాలి

మరిపెడరూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మరిపెడ మండలం గాలివారిగూడెం స్టేజీ ఏఎన్నార్ గార్డెన్స్‌లో నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను ఓడించాలి

ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం


మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం

తిరుమలాయపాలెం: దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను ఓడించాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రధానమంత్రి అయి ఉండి మతాల మధ్య కులాల మధ్య చిచ్చురేపేలా బహిరంగంగా ప్రసంగిస్తున్నారని దుయ్యబట్టారు. మతతత్వ బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కులను హరించే విధానాలను మోదీ అవలంబించడం దారుణమని, దానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ సమావేశంలో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రం అచ్చయ్య, జిల్లా నాయకులు కమ్మకోటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, రాయల రవికుమార్, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, మారుతి మల్లయ్య, పగిడికత్తుల రామదాసు, ఈర్ల వెంకటఅప్పారావు, ఆరెంపుల వెంకన్న, ఎడ్లపల్లి నవీన్, పులిగుజ్జు వెంకటస్వామి, గోకనపల్లి సరోజన పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి..


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి, రవీందర్

ఖమ్మంసహకారనగర్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రఘురాంరెడ్డి, బలరాంనాయక్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్‌రెడ్డి, పూల రవీందర్ అన్నారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించామని, ఆయన అన్ని విషయాలపై సానుకూలంగా స్పందించి ఎన్నికల కోడ్ ముగియగానే సమస్యల పరిష్కారానికి హామీనిచ్చారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో రెండింటిని విడుదల చేస్తామని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు, పెండింగ్ బిల్లులను జూన్ 30లోగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. సమావేశంలో మోతుకూరి మధు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో ఎన్నెస్పీ కాలువ వద్ద ఓ వ్యక్తి నుంచి 35 మద్యం బాటిళ్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన షేక్ జానీ మియా మద్యం సీసాలను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. జానీ మియాపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగులక్ష్మీరా తెలిపారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఖమ్మంక్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చర్చికాంపౌండ్ ప్రాంతానికి చెందిన కాళంగి మధు (45) కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు కృపాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటో పల్టీ

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండా రోడ్డులో మూలమలుపు వద్ద ట్రాలీ ఆటో పల్టీకొట్టిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. నగరంలోని బాలాపేటకు చెందిన 10 మంది యువకులు ఓ శుభకార్యానికి డీజే తీసుకొచ్చేందుకు ట్రాలీ ఆటోలో రాంక్యాతండాకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో పల్టీ కొట్టగా ఆనంద్, మంగీలాల్, నాగేశ్వరరావుతో పాటు వికాస్ గాయపడ్డారు. వారందరినీ ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

బస్సు, లారీ ఢీ


బస్సు, లారీ ఢీకొన్న దృశ్యం

తల్లాడ: తల్లాడ మండలం పినపాక సమీపంలో ఆదివారం బస్సు, లారీ (కంటెయినర్) ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 14 మందికి గాయాలయ్యాయి. మణుగూరు డిపోకు చెందిన బస్సు ఖమ్మం వెళ్తుండగా వైరా నుంచి తల్లాడ వైపు వస్తున్న లారీ పినపాక, డాన్‌బోస్కో పాఠశాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పాల్వంచకు చెందిన బొమ్మగాని శ్రావణి, ఖమ్మానికి చెందిన వందనపు ఝాన్సీరాణి, గార్లపాటి గీత, రమాదేవి, కె.ఉపేందర్‌రావు, ఎ.అరుణ, భార్గవి చింతకాని మండలం నేరడకు చెందిన వై.వెంకటేశ్వరరావు, అతని భార్య, ఎన్టీఆర్ జిల్లా అనిగండ్లపాడుకు చెందిన ఈలప్రోలు నరసింహారావు, లలిత, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సోను, బస్సు డ్రైవర్ అప్పారావు, వైరాకు చెందిన డి.విజయ్‌కు దెబ్బలు తగిలాయి. గాయపడిన వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తల్లాడ ఎస్‌ఐ కొండల్‌రావు సిబ్బంది సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్ స్తంభించడంతో జేసీబీ సాయంతో వాహనాలను తప్పించారు.

పిడుగు పడి ఫర్నిచర్ దగ్ధం


కాలిపోయిన వస్తువులను పరిశీలిస్తున్న సిబ్బంది

ఖమ్మంక్రైం: నగరంలో ఆదివారం సాయంత్రం పిడుగుపడి ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్‌లో ఫర్నిచర్ దగ్ధం అయింది. షాదీఖానా వెనుక ఉన్న చిట్‌ఫండ్ భవనంపై ఒక్కసారిగా పిడుగుపడింది. కార్యాలయంలోని ఏసీలు, ఫర్నిచర్ దగ్ధం అయ్యాయి. సెలవు దినం కావటంతో కార్యాలయంలో ఎవరూ లేకపోవటం వల్ల ప్రమాదం తప్పింది. కార్యాలయం నుంచి పొగలు రావటంతో కింద ఉన్న దుకాణం వారు చిట్‌ఫండ్ వారికి, అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. ఖమ్మం అగ్నిమాపకశాఖాధికారి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

బైక్‌ను తగలబెట్టిన దుండగులు


పూర్తిగా కాలిపోయిన బైక్

నేలకొండపల్లి: బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కైలాసపు నాగరాజు బైక్‌ను గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. ఆదివారం తెల్లవారుజామున డాబాపైన నిద్రిస్తున్న నాగరాజు కుటుంబ సభ్యులకు కాలుతున్న వాసన రావటంతో కిందకు దిగి చూశారు. అప్పటికే బైక్ (గ్లామర్) పూర్తిగా కాలిపోయింది. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

35 మంది మావోయిస్టుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టులను చూపిస్తున్న దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్

వివరాలు వెల్లడించిన దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్


చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఆదివారం 35 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయ్ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ పోలీస్‌శాఖ చేపట్టిన పూనా నార్కొమ్ ప్రచారానికి ఆకర్షితులవుతున్న మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వనం వీడి జనం బాట పడుతున్నారని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాల అటవీ ప్రాంత గ్రామాల్లో కొంత కాలంగా కొనసాగుతున్న లోన్ వర్రాటో (ఇంటికి తిరిగి రండి) కార్యాక్రమంలో భాగంగా బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న 35 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారని తెలిపారు. వారిలో ముగ్గురిపై రూ. లక్ష చొప్పున రివార్డు ఉందని, లొంగిపోయిన వారందరికీ పోలీస్ శాఖ, ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున నగదు అందజేసినట్లు వెల్లడించాచారు. లోన్ వర్రాటో కార్యక్రమం చేపట్టిన నాటి నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 796మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో 180 మందిపై రివార్డులు ఉన్నాయని ఎస్పీ వివరించారు.

బాహుబలుల బరి!

మామాజీ, దిగ్గీ రాజా, సింధియాల గురి | మధ్యప్రదేశ్‌లో 9 చోట్ల 7న పోలింగ్ | అన్నీ కమలనాథుల సిట్టింగ్ స్థానాలే | ఈసారి కొన్నింట కాంగ్రెస్ గట్టి పోటీ

వారిద్దరూ మాజీ సీఎంలు. ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలోనూ చక్రం తిప్పిన ఉద్దండులు. సుదీర్ఘకాలం తర్వాత లోక్‌సభ బరిలో దిగారు. వీరికి తోడు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. ఇలా పలువురు కీలకమైన నేతల పోటీకి మధ్యప్రదేశ్‌లో మూడో విడత ఎన్నికలు వేదికగా మారాయి. రాష్ట్రంలోని 9 లోక్‌సభ స్థానాలకు 7న పోలింగ్ జరగనుంది. 2019 ఎన్నికల్లో వీటన్నింటిలోనూ కమలమే విరబూసింది. ఈసారి పలు స్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీయే ఇస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక స్థానాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్



సింధియా | చౌహాన్ | దిగ్విజయ్ | అలోక్‌సింగ్ | సంధ్యా రాయ్ | సికర్‌వార్

విదిశ

మధ్యప్రదేశ్‌కు సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న బీజేపీ దిగ్గజం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ బాట పట్టారు. విదిశ ఓటర్లకు ఆయన కొత్తేమీ కాదు. 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తమ్మీద ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారు. నియోజకవర్గ ప్రజలు చౌహాన్‌ను ఆప్యాయంగా మామాజీ అని పిలుచుకుంటారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మతో పోలిస్తే ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 1991లో వాజ్‌పేయినీ లోక్‌సభకు పంపిన చరిత్ర విదిశకు ఉంది. 2009, 2014 ఎన్నికల్లో బీజేపీ దిగ్గజం సుష్మా స్వరాజ్ కూడా ఇక్కడి నుంచి గెలిచారు.

రాజ్‌గఢ్

మాజీ సీఎం, కాంగ్రెస్ కీలక నేత దిగ్విజయ్ సింగ్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక్కడి ప్రజలు గత రెండు ఎన్నికలుగా బీజేపీనే గెలిపిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ బీజేపీ నుంచి రోడ్మల్ నాగర్ ఇక్కడ బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. 2014లో 2.28 లక్షల మెజారిటీ సాధించగా 2019లో 4.31 లక్షలకు పెంచుకున్నారు. ఈసారీ బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. అభిమానులు దిగ్గీ రాజా అని పిలుచుకునే దిగ్విజయ్ ఏకంగా 30 ఏళ్ల తర్వాత ఇక్కడ పోటీకి దిగుతుండటం విశేషం. ఆయన సోదరుడు లక్ష్మణ్ సింగ్ ఇక్కడ ఐదుసార్లు గెలిచారు లక్ష్మణ్ సింగ్ 2004లో బీజేపీ టికెట్‌పైనా గెలవడం విశేషం!

భోపాల్

వివాదాస్పద బీజేపీ నాయకురాలు సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2019లో మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్‌ను ఆమె ఏకంగా 3.64 లక్షల ఓట్ల ఆధిక్యంతో మట్టి కరిపించి సంచలనం సృష్టించారు. అయినా వివాదాస్పదురాలిగా పేరుపడ్డ సాధ్వికి బీజేపీ ఈసారి టికెటివ్వకపోవడం విశేషం! భోపాల్ 1989 నుంచీ బీజేపీ కంచుకోటగా కొనసాగుతోంది. 1999లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం ఉమా భారతి ఇక్కడ గెలిచారు. 2004, 2009ల్లో కైలాష్ చంద్రజోషి విజయం సొంతం చేసుకున్నారు. ఇలా అభ్యర్థులు మారుతున్నా బీజేపీనే ఓటర్లు దీవిస్తున్నారు. ఈసారి ఆ పార్టీ నుంచి అలోక్ శర్మ, కాంగ్రెస్ నుంచి అరుణ్ శ్రీవాస్తవ్ బరిలో ఉన్నారు.

మొరేనా

ఇక్కడ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రామ్‌నివాస్ రావత్‌ను బీజేపీ అభ్యర్థి నరేంద్రసింగ్ తోమర్ 1.13 లక్షల ఓట్ల వ్యత్యాసంతో ఓడించారు. తోమర్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. బీజేపీ నుంచి శివమంగళ్ సింగ్ తోమర్, కాంగ్రెస్ నుంచి సత్యపాల్ సింగ్ సికర్‌వార్ పోటీ చేస్తున్నారు. 1996 నుంచి ఇక్కడ బీజేపీదే విజయం. 1996, 1998, 1999, 2004ల్లో అశోక్ అర్గల్, 2009లో నరేంద్రసింగ్ తోమర్ గెలిచారు. ఇది సురక్షిత స్థావరమనే ధీమాతో ఇప్పటిదాకా పెద్ద ఎన్నికలను ఎదుర్కోని శివమంగళ్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. ఇక్కడ అభ్యర్థిని మార్చడం ఆ పార్టీకి ఇది వరుసగా మూడోసారి! కాంగ్రెస్ అభ్యర్థి సికర్‌వార్ మాజీ బీజేపీ నేతే. మొరేనాలో బ్రాహ్మణ, రాజ్‌పుత్ ఓట్లు రెండేసి లక్షల చొప్పున ఉన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ ఏకంగా ఐదింట్లో గెలవడంతో ఈసారి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

వీటికి ఎన్నిక

మొరేనా, భింద్, గ్వాలియర్, గుణ, సాగర్, విదిశ, భోపాల్, రాజ్‌గఢ్, బేతూల్ (ఇక్కడ రెండో విడతలోనే పోలింగ్ జరగాల్సింది. బీఎస్పీ అభ్యర్థి మృతితో మూడో విడతకు వాయిదా వేశారు)

గుణ

ఇది సింధియాల కోట. మూడో విడతలో దేశవ్యాప్తంగా బాగా ఆసక్తి నెలకొన్న స్థానాల్లో ఒకటి. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా 2002 నుంచి 2019 దాకా ఈ స్థానానికి కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మారిన రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. ఆయనతో కాంగ్రెస్ నేత రావు యాదవేంద్రసింగ్ యాదవ్ పోటీ పడుతున్నారు. 2019లో ఇక్కడ బీజేపీ నేత కృష్ణపాల్ సింగ్ యాదవ్ చేతిలో జ్యోతిరాదిత్య ఓటమి చవిచూశారు! 1957లో ఇక్కడ జ్యోతిరాదిత్య నానమ్మ విజయరాజె సింధియా గెలిచారు. 1971లో ఆమె కుమారుడు, జ్యోతిరాదిత్య తండ్రి దివంగత మాధవ్‌రావు సింధియా భారతీయ జనసంఘ్ తరఫున ఇక్కడ నెగ్గారు.

భింద్

చంబల్ ప్రాంతంలో ఉన్న ఈ స్థానంలో ఆది నుంచి బీజేపీదే ఆధిపత్యం. 2008లో ఎస్సీలకు రిజర్వ్ అయిన తర్వాత కూడా వరుసగా మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీయే గెలిచింది. కాంగ్రెస్ నుంచి ఫూల్‌సింగ్ బారియా, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1971లో విజయరాజె సింధియా కాంగ్రెస్ నుంచి నెగ్గారు. భింద్‌లో కూడా బ్రాహ్మణ, క్షత్రియ ఓట్లు కలిపి ఆరు లక్షలకు పైనే ఉన్నాయి.

విస్తృత ప్రచారం

మధ్యప్రదేశ్‌లో మూడో విడత స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. రెండు పార్టీల అగ్ర నేతలు కూడా ఇప్పటికే సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. తన తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం బలిదానం చేశారంటూ మొరెనాలో ప్రియాంక భావోద్వేగపూరితంగా మాట్లాడారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మొరేనా, బేతూల్, రాజ్‌గఢ్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. కులం, నిరుద్యోగం, పేదరికం, వలసలు మూడో విడత స్థానాల్లో బాగా ప్రభావం చూపే అంశాలు.

ఎన్నికల రంగోలి!

ఎన్నికల్లో ఓటింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం ఎన్నో వినూత్నమైన చర్యలు చేపడుతోంది. అహ్మదాబాద్ ఎన్నికల అధికారులు కొంచెం భిన్నంగా ఆలోచించారు. 'మీ విలువైన ఓటుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి' అన్న పిలుపు కంటే ఓటు ప్రాధాన్యతను కళాత్మకంగా చెబితే మనసులో బాగా నాటుకుంటుందని భావించారు. స్థానిక అల్ఫా వన్ మాల్ ఆవరణలో ఏకంగా 12 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో ఓటుపై అవగాహన కల్పించే రంగోలీ రూపొందించారు. ఇందుకు 350 కిలోల రంగులు వినియోగించారు. 18 గంటల సమయం పట్టిందట. ప్రజలను ఓటు దిశగా ప్రోత్సహించి, అహ్మదాబాద్‌ను అత్యధిక ఓటింగ్ నమోదైన ప్రాంతంగా చేయడమే తమ ఉద్దేశమని నోడల్ ఆఫీసర్ యోగేశ్ పరేఖ్ అంటున్నారు. మాల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఈ ఆర్ట్ తెగ ఆకర్షిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్





శాంభవీ చౌదరి.. యంగెస్ట్ క్యాండిడేట్!

బిహార్‌లోని సమస్తిపూర్ నుంచి ఎల్‌జేపీ అభ్యర్థిగా లోక్‌సభ బరిలో

శాంభవీ చౌదరి. ఈ లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నవారిలో అత్యంత చిన్నవయస్కురాలు. 25 ఏళ్ల శాంభవి బిహార్ మంత్రి అశోక్ చౌదరి కుమార్తె. లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ చేశారు. బిహార్‌లోని మగధ్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అభ్యర్థిగా సమస్తిపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

రాజకీయ కుటుంబంలో పుట్టిపెరగడంతో శాంభవికి సహజంగానే రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తొలుత చదువుకే ప్రాధాన్యమిచ్చారు. బిహార్‌లో దేవాలయాల్లో దళిత పూజారులను నియమించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆచార్య కిషోర్ కునాల్ కుమారుడు సాయన్ కునాల్‌ను పెళ్లాడారు. అత్తగారి ఊరైన సమస్తిపూర్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. పైగా తండ్రి పార్టీ అయిన జేడీ (యూ)ను కాదని చిరాగ్ పార్టీలో చేరడం విశేషం! అది తన సొంత రాజకీయ నిర్ణయం అంటారామె. బిహార్‌కు, బిహారీలకు తొలి ప్రాధాన్యమిచ్చే చిరాగ్ విజన్ నచ్చి ఎల్‌జేపీలో చేరానంటారు. ''చిరాగ్ భయ్యా విజన్‌కు ఆకర్షితురాలినయ్యాను. ఎందుకంటే నేను ఢిల్లీ వర్సిటీలో చదివేటప్పుడు 'మీరు బీహారీలా కనిపించడం లే'దని ప్రొఫెసర్లు అనేవారు. బిహారీలా కనిపించకపోవడం, దళితురాలిగా కనిపించకపోవడం ఏమిటా అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. అది నాపై తీవ్ర ప్రభావం చూపింది'' అంటారు శాంభవి. ''సమస్తిపూర్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన నా తొలి ప్రాథమ్యాలు. వచ్చే ఐదేళ్లలో రాబోయే తరాల కోసం సరికొత్త సమస్తిపూర్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా'' అని వివరించారు. కాంగ్రెస్‌తో స్థానికంగా యాదవ, ముస్లిం, ఓబీసీ ఓటు బ్యాంకు అధికంగా ఉన్నా తన ఎస్సీ నేపథ్యం, భర్త ఓబీసీ నేపథ్యం కలిసొస్తాయని ధీమాతో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తొలి రెండు దశల్లోనూ...

తగ్గిన మహిళా ఓటింగ్

పురుషులతో పోలిస్తే పలు రాష్ట్రాల్లో భారీ అంతరం

మహిళలు ఆకాశంలో సగం. అవకాశాల్లో అంతకంటే ఎక్కువే. అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానం. ఓటర్లపరంగా చూస్తే పలు రాష్ట్రాల్లో పురుషుల కంటే ఎక్కువే. అందుకే పార్టీలన్నీ తమ మేనిఫెస్టోల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో మహిళల కోసం ప్రత్యేక పథకాలు పుట్టుకొస్తున్నాయి. కర్నాటకలో, తాజాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జయాపజయాల్ని నిర్దేశించింది ఈ మహిళా పథకాలే! అయితే ఎందుకో గానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మహిళల్లో 'ఓటు ఉత్సాహం' లోపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన రెండు విడతల పోలింగ్‌లో మహిళల ఓటింగ్ శాతం తగ్గినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామం కాదంటున్నారు విశ్లేషకులు...

– సాక్షి, నేషనల్ డెస్క్



లోక్‌సభ ఎన్నికల తొలి రెండు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మహిళల ఓటింగ్ శాతంలో తగ్గుదల నమోదైంది. 2019తో పోల్చి చూసినప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి దాకా రెండు విడతల్లో ఓటు వేసిన మహిళల శాతం 0.8 శాతం మేర తగ్గింది. 2019లో తొలి రెండు విడతలతో పోలిస్తే ఈసారి మొత్తమ్మీద (స్త్రీ, పురుషులు) 3.3 శాతం దాకా తక్కువ ఓటింగ్ నమోదైంది. ఈ ఏడాది తొలి విడతలో దశలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో మొదటి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.6 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇక్కడ దయనీయం

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే నాగాలాండ్ లోక్‌సభ స్థానంలో ఈసారి రికార్డు స్థాయిలో మహిళల ఓటింగ్ ఏకంగా 24.79 శాతం తగ్గిపోయింది! మొత్తమ్మీద కూడా అక్కడ చాలా తక్కువ ఓటింగ్ నమోదైంది. మహిళల ఓటింగ్ సిద్ధీ లోక్‌సభ స్థానంలో 13 శాతం, మథురలో 13 శాతం, రేవా, పథనంతిట్టల్లో 12 శాతం, ముజఫర్‌నగర్, ఖజురహోల్లో 11 శాతం తగ్గింది. కొట్టాయం, ఇడుక్కి, రాంపూర్, సత్నా, భాగ్‌పత్‌ల్లో 10 శాతం, వయనాడ్‌లో 7 శాతం, బెంగళూరు రూరల్‌లో 7 శాతం, ఔరంగాబాద్‌లో 5 శాతం, ఝుంఝునూలో 9 శాతం, షిల్లాంగ్‌లో 8 శాతం చొప్పున మహిళల ఓటింగ్ తగ్గింది. మొత్తం మీద చూస్తే 14 లోక్‌సభ స్థానాల్లో 10 నుంచి 20 శాతం మధ్య, 59 చోట్ల 5–10 శాతం, 80 చోట్ల 0–5 శాతం ఓటింగ్ తగ్గిపోయింది. ఛత్తీస్‌గఢ్, కర్నాటక, త్రిపుర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్, రాజస్థాన్, మిజోరం, యూపీల్లో మహిళల ఓటింగ్ బాగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడ నయం

రెండు దశల్లో ఎన్నికలకు వెళ్లిన నియోజకవర్గాల్లో 34 చోట్ల మాత్రం మహిళల ఓటింగ్ 0–5 శాతం మధ్య పెరిగింది. ఒక స్థానంలో ఇది మరింత ఎక్కువగా నమోదైంది. లక్షద్వీప్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర స్థానాల్లో 80 శాతం మహిళలు ఉత్సాహంగా ఓటు వేయడం ప్రోత్సాహనీయం. బీహార్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, తమిళనాడు, కేరళ, మేఘాలయ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ, పుదుచ్చేరిలోనూ పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో రాష్ట్రాలవారీగా పోలింగ్ శాతం

రాష్ట్రం/యూటీ	మహిళల ఓటింగ్	పురుషుల ఓటింగ్
లక్షద్వీప్	85.5	82.9
త్రిపుర	80.6	81.3
సిక్కిం	79.8	79.9
అసోం	79.6	79
పుదుచ్చేరి	79.1	78.6
పశ్చిమబెంగాల్	80.3	78.3
మణిపూర్	79	77.9
అరుణాచల్‌ప్రదేశ్	80.6	76.3
మేఘాలయ	79.7	75.4
ఛత్తీస్‌గఢ్	73.5	75
కర్నాటక	71.1	71.5
కేరళ	71.7	70.6
తమిళనాడు	70.2	69.8
జమ్మూకశ్మీర్	71	69.6
మహారాష్ట్ర	60.7	65.9
మధ్యప్రదేశ్	61.3	65.3
అండమాన్	63.8	64.4
రాజస్థాన్	60.5	62.2
ఉత్తరప్రదేశ్	56.7	56.9
మిజోరం	55.7	58.1
నాగాలాండ్	57.9	57.5
ఉత్తరాఖండ్	58	54.5
బిహార్	56	53.2

ప్రస్తుత ఎన్నికల వరకే చూస్తే మొత్తం మీద స్త్రీ పురుషుల ఓటింగ్ మధ్య పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదు. తొలి విడతలో మహిళల ఓటింగ్ 66.1 శాతం, పురుషుల ఓటింగ్ 66.2 శాతం నమోదైంది. రెండో విడతలో 66.4, 67 శాతంగా ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే మాత్రం తేడా బాగానే ఉంది.

మంచి పరిణామం కాదు

మహిళలు మరింతగా ముందుకొచ్చి ఓటు వేస్తేనే నేతలకు, పార్టీలకు, ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. మిగతా ఐదు విడతల పోలింగ్‌లోనూ మహిళల అనాసక్తి ఇలాగే కొనసాగితే అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. మహిళా ఓటర్ల మనసు గెలిచేందుకు పార్టీలు మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయన్న అభిప్రాయమూ ఉంది.

సంయుక్త... మంత్రిగారి అమ్మాయి

పుస్తకాల పురుగు



పరిచయం

సంయుక్తా పాటిల్. మంచి ఫుడీ. అంతకు మించి పుస్తకాల పురుగు. మంచి పుస్తకం దొరికిందంటే దాన్ని పూర్తి చేసేవరకు నిద్ర పోరు. బసవేశ్వరుని భక్తురాలు. కర్నాటక వ్యవసాయ మంత్రి శివానంద్ పాటిల్ కూతురైన సంయుక్త బీజాపూర్ గ్రామీణ మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నారు. జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా వారి ఆర్థిక స్వావలంబన కోసం పాటుపడుతున్నారు. బాగల్‌కోట్ నుంచి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ సీనియర్ నేత పీసీ గద్దీ గౌడర్‌తో కాంగ్రెస్ తరఫున తలపడుతున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

క్షేత్రస్థాయిలో..

30 ఏళ్ల సంయుక్త క్రైస్ట్ యూనివర్సిటీ లా స్కూల్లో న్యాయ శాస్త్రం చదివారు. తండ్రి రాజకీయాలను చూస్తూ ఎదిగారు. విద్యార్థిగా ఎన్‌ఎస్‌యూఐలో పని చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా అత్యధిక ఓట్లతో గెలిచారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా ప్రజల మనసులను గెలుచుకున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలతో మమేకమై ఉండాలన్న పాఠాన్ని తండ్రి నుంచి నేర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సంక్షేమానికి పని చేయాలన్న తండ్రి సూచన మేరకు 2017లో స్పర్శ్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇది గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం పనిచేస్తుంది. పాలసీలు సమాజంలోని అట్టడుగు వ్యక్తులకు చేరినప్పుడే అవి విజయం సాధించినట్లని సంయుక్త నమ్ముతారు. సాయంకాలాల్లో గ్రామాల్లోని ప్రజలను కలవడానికే ఇష్టపడతారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బసవనబాగేవాడి నియోజకవర్గంలో తండ్రి ప్రచారమంతా తానై నిర్వహించారు. అయితే ఎన్నికల ప్లానింగ్ ఒకెత్తు. నేరుగా పోటీ చేయడం మరో ఎత్తు. విద్యార్థి, యువజన సంఘాల ఎన్నికల అనుభవం తనకిప్పుడు ఉపయోగపడుతుందంటారామె. కొత్త పరిశ్రమలు, పర్యాటకాభివృద్ధి, బాగల్‌కోట్–కుడచి పెండింగ్ రైల్వే లైన్ పరిపూర్తి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వ్యవసాయాధారిత బాగల్‌కోట్ ప్రాంతం రెండు కరువులను ఎదుర్కొంది. ''అందుకే నీటి పారుదలపై దృష్టి పెడతా. ప్రజల గొంతుకగా మారతా'' అంటున్నారు.

బీజేపీకి గట్టి సమాధానం..

వారసత్వ రాజకీయాలపై బీజేపీ విమర్శలను సంయుక్త తేలిగ్గా తీసిపారేస్తారు. ''తల్లిదండ్రుల నేపథ్యం వల్ల రాజకీయాల్లోకి ఎంట్రీ సులభం అవుతుంది. కానీ చివరికి ప్రజలే నిర్ణేతలు. వాళ్లు అంగీకరించకపోతే ఎంతటి నేతల పిల్లలయినా రాజకీయాల్లో రాణించలేరు'' అన్నది ఆమె వాదన. ''దేశంలోని 65 శాతం మంది ఓటర్లు 40 ఏళ్ల లోపువారే. 50 శాతం 25 ఏళ్ల లోపువారే. కానీ 40 ఏళ్ల లోపున్న పార్లమెంటేరియన్లు మాత్రం కేవలం 12 శాతం. యువత ప్రజాప్రతినిధుల సంఖ్య బాగా పెరగాలి'' అంటారు సంయుక్త. ఆమె విజయపుర అసెంబ్లీ నియోజకవర్గవాసి. కనుక బాగల్‌కోట్‌కు బయటి వ్యక్తి అంటూ బీజేపీ విమర్శిస్తోంది. తాను బయటి వ్యక్తినెలా అవుతానని ప్రశ్నిస్తారామె. ''నేను అవిభక్త బీజాపూర్‌లో పుట్టా. ప్రతి ర్యాలీలోనూ నాకు ఘన స్వాగతం లభిస్తోంది. ఏ ఇంటికి వెళ్లినా నా ఇంటికి వెళ్లినట్టే ఉంటుంది'' అంటూ కొట్టిపారేస్తారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యంపైనా గళం విప్పుతున్నారు సంయుక్త. రాజకీయాల్లో ఎక్కువ మంది మహిళలుంటే విధాన రూపకల్పనలో మహిళా దృక్పథం వస్తుందన్నది ఆమె వాదన.

ఎనిమిదేళ్లుగా రంజాన్ ఉపవాసాలు...

సంయుక్త 12వ శతాబ్దపు మత, సంఘ సంస్కర్త బసవేశ్వరుని భక్తురాలు. అయితే ఎనిమిదేళ్లుగా రంజాన్ మాసమంతా విధిగా ఉపవాసం (రోజా) పాటిస్తున్నారు. మతమేదైనా విశ్వాసం మంచిదైనప్పుడు ఆచరించడంలో తప్పేముందని ప్రశ్నిస్తారు. ''పెద్దయ్యాక ఏమవుతావని నా చిన్నతనంలో ఎవరడిగినా ప్రధాని అవుతాననేదాన్ని. ఇప్పుడు ఎంపీ అయ్యే అవకాశం వచ్చింది. ఏమో, భవిష్యత్‌లో ప్రధాని కూడా అవుతానేమో!'' అని ఆశాభావం వ్యక్తం చేస్తారు సంయుక్త.